
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం: 33.0 కనిష్ఠం: 21.0
ANDHRAJYOTHY
5
నాగర్‌కర్నూల్ జిల్లా వార్తలు
సోమవారం 26 ఫిబ్రవరి 2024



కొత్త సొబగులు..

- ఉమ్మడి పాలమూరులో మూడు రైల్వేస్టేషన్ల ఆధునికీకరణ
- గద్వాల, జడ్చర్ల, షాద్‌నగర్ స్టేషన్లు అమృత్ భారత్ పథకం కింద ఎంపిక
- రూ. 30.02 కోట్లతో మారనున్న రైల్వే స్టేషన్ల రూపురేఖలు
- మరో ఎనిమిది ఆర్‌యూబీల నిర్మాణం
- నేడు వర్చువల్‌గా పనులు ప్రారంభించనున్న పీఎం మోదీ



ఆధునికీకరించనున్న గద్వాల రైల్వేస్టేషన్ నమూనా

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి జిల్లాలో పలు రైల్వే స్టేషన్లకు కొత్త సొబగులు సమకూరనున్నాయి. రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ, వసతుల కల్పన, ప్రపంచ స్థాయి స్టేషన్లుగా తీర్చిదిద్దడం కోసం కేంద్ర ప్రభుత్వం గత సంవత్సరం అమృత్ భారత్ స్టేషన్ పథకాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా మొదటి విడతలో కొన్ని స్టేషన్లను ఇప్పటికే అభివృద్ధి చేయగా.. రెండో విడతలో భాగంగా దేశవ్యాప్తంగా 554 స్టేషన్లను అభివృద్ధి చేయనుంది. 1,500 రోడ్ అండర్ బ్రిడ్జిల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. సౌత్ సెంట్రల్ రైల్వే పరిధిలో 57 రైల్వే స్టేషన్ల పునరుద్ధరణ, ఆధునిక సౌకర్యాల కల్పనకు రూ.925 కోట్లు కేటాయించగా.. 156 రోడ్ అండర్ బ్రిడ్జిల నిర్మాణానికి రూ.927.31 కోట్లు కేటాయించింది. ఇందులో భాగంగా తెలంగాణలో మొత్తం 15 స్టేషన్లను ఎంపిక చేయగా.. మూడు స్టేషన్లు ఉమ్మడి పాలమూరు జిల్లా పరిధిలో ఉన్నాయి. అలాగే నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఎనిమిది రోడ్డు అండర్ బ్రిడ్జిలను నిర్మించనుంది. మూడు రైల్వే స్టేషన్ల ఆధునీకీకరణ కోసం రూ. 30.02 కోట్లు కేటాయించింది. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సోమవారం ఈ స్టేషన్లలో అభివృద్ధి పనులు, రోడ్డు అండర్ బ్రిడ్జిల నిర్మాణానికి వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో రైల్వే కనెక్టివిటీ చాలా తక్కువగా ఉంది. మహబూబ్‌నగర్, గద్వాల, నారాయణపేట జిల్లాల పరిధిలో రైల్వేలైన్ ఉన్నప్పటికీ.. ఇక్కడి స్టేషన్లలో సూపర్ ఫాస్ట్ రైళ్లు ఎక్కువగా ఆగడం లేదు. దాంతో రైల్వే లైన్ కనెక్టివిటీ పెంచడంతోపాటు ఉన్న స్టేషన్లను అభివృద్ధి చేయాలనే ప్రతిపాదనలు ఎక్కువగా ఉన్నాయి. కొన్నాళ్ల క్రితం వరకు ఈ మార్గంలో కేవలం డీజిల్ లోకోమోటివ్ రైళ్లు మాత్రమే తిరగ్గా.. ప్రస్తుతం ఎలక్ట్రిఫికేషన్ పూర్తి చేశారు. అలాగే మహబూబ్‌నగర్ వరకు డబ్లింగ్ పనులు కూడా పూర్తయ్యాయి. తాజాగా రైల్వే స్టేషన్ల ఆధునీకకరణకు నిధులు మంజూరు చేయడంతో ప్రయాణికుల్లో ఆనందం

ఫలించిన ఎంపీ రాములు కృషి..

గద్వాల రైల్వే స్టేషన్ అభివృద్ధి కోసం నాగర్‌కర్నూలు ఎంపీ రాములు కృషి ఫలించిందని చెప్పొచ్చు. అష్టాదశ శక్తిపీఠాల్లో ఐదో శక్తిపీఠమైన జోగుళాంబ ఆలయం గద్వాల జిల్లా పరిధిలో ఉండటం.. ఎక్కువ రైళ్లు ఆగే స్టేషన్ కావడంతో ప్రయాణికుల సౌకర్యార్థం ఇక్కడ ఆధునిక వసతులు కల్పించాలని నాగర్‌కర్నూలు ఎంపీ రాములు పలుమార్లు రైల్వే మంత్రి, రైల్వే శాఖ స్టాండింగ్ కౌన్సిల్ ఛైర్మన్, సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్‌ను కలిసి వినతి పత్రాలు అందజేశారు. గత సంవత్సరం ఆగస్టు ఆరున కేంద్ర రైల్వే శాఖ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ రాధామోహన్ సింగ్‌ను కలవగా.. అంతకుముందు జూలై ఐదున రైల్వేశాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్‌ను కలిశారు. రాములు కృషితో గద్వాల రైల్వే స్టేషన్ ఆధునికీకరణకు ఈ నెల 22న కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఎనిమిది ఆర్‌యూబీలను నిర్మించేందుకు అంగీకారం తెలిపింది. ఇప్పటికే స్టేషన్ల అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికలు సిద్ధం చేయగా.. సోమవారం ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా పనులను ప్రారంభించనున్నారు.

కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు..

నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని గద్వాల రైల్వేస్టేషన్‌కు అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద నిధులు మంజూరు చేసినందుకు కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్‌కు కృతజ్ఞతలు. ఈ స్టేషన్‌ను అభివృద్ధి చేయాలని తనను చాలామంది కోరిన నేపథ్యంలో పలు మార్లు కేంద్రమంత్రితో మాట్లాడి, ఒప్పించాను. గద్వాల రైల్వేస్టేషన్‌తోపాటు నా పరిధిలో ఎనిమిది ఆర్‌యూబీల నిర్మాణానికి కేంద్రం పచ్చజెండా ఊపడం సంతోషదాయకం.

- పోతుగంటి రాములు, ఎంపీ, నాగర్‌కర్నూల్


రైల్వేశాఖ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎంపీ రాములు (ఫైల్)

వ్యక్తం చేస్తున్నారు.

రూ.30.02 కోట్లతో స్టేషన్ల అభివృద్ధి..

కాచిగూడ - కర్నూలు మార్గంలో రైల్వే స్టేషన్లు చాలా ఉన్నప్పటికీ.. అందులో తగిన సౌకర్యాలు లేకపోవడం, ప్రయాణికుల రద్దీ రోజురోజుకూ పెరుగుతుండటంతో ఇబ్బందులు పెరిగాయి. అలాగే స్టేషన్ల వద్ద పరిశుభ్రత, ఆహ్లాదకర వాతావరణం కూడా లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి పాలమూరు జిల్లా పరిధిలో మూడు స్టేషన్లను కేంద్రం అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద ఎంపిక చేసింది. వాటి అభివృద్ధికి రూ.43.39 కోట్లు కేటాయించింది. అందులో గద్వాల రైల్వేస్టేషన్ అభివృద్ధికి రూ.9.49 కోట్లు, జడ్చర్ల స్టేషన్‌కు రూ.10.94 కోట్లు, షాద్‌నగర్ స్టేషన్‌కు రూ.9.59 కోట్లు కేటాయించింది. ఈ పథకంలో భాగంగా రైల్వే స్టేషన్ల ముఖ ద్వారాలను అభివృద్ధి చేయడం లేదా కొత్తవి నిర్మిస్తారు. అలాగే స్టేషన్ అప్రోచ్ రోడ్లను వేయడంతోపాటు వైడెనింగ్ చేస్తారు. ఆధునికంగా సిద్ధం చేసిన సైన్‌బోర్డులు, పాదచారుల మార్గాలు, కచ్చితమైన ప్రణాళికతో పార్కింగ్ స్థలాలు, విద్యుత్ లైట్లు ఏర్పాటు చేస్తారు. స్టేషన్ల ఆవరణలో పచ్చదనం ఉండేలా పనులు చేపడతారు. స్థానిక కళలు, నైపుణ్యాలు ఉట్టిపడి.. ప్రయాణికులకు ఆ ప్రాంత వైభవం తెలిసేలా పెయింటింగ్స్ వేస్తారు. స్థానిక ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇచ్చి స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తారు. స్టేషన్ అవసరాన్ని బట్టి రెండో ప్రవేశ ద్వారం ఏర్పాటు చేయనున్నారు. అలాగే హైలెవల్ ప్లాట్‌ఫామ్స్, అనుకూలంగా ఉండే షెల్టర్లను నిర్మిస్తారు. అధునాతనమైన సౌండ్ సిస్టమ్స్, ఎల్ఈడీ నేమ్ బోర్డులు, వెయిటింగ్ హాళ్ల సుందరీకరణను చేపడతారు.



గద్వాల రైల్వే స్టేషన్ మెయిన్ ఎంట్రెన్స్ ఆర్చి నమూనా

వైభవంగా రథోత్సవం

- గోవింద నామస్మరణతో మార్మోగిన కొండలు
- వేలాదిగా తరలొచ్చిన భక్తులు
- పూజలు చేసి ప్రారంభించిన ఎమ్మెల్యే కలెక్టర్


రథంపై ఉత్సవ మూర్తులు


రథోత్సవం అనంతరం నిర్వహించిన గ్రామోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డి

మహబూబ్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 25: పేదల తిరుపతి మన్యంకొండ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి రథోత్సవం శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు వైభవంగా సాగింది. మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, కలెక్టర్ రవి గుగులోతు, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, కాంగ్రెస్ మహబుబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి, ముఖ్య అతిథులుగా హాజరై రథోత్సవాన్ని ప్రారంభించారు. వారికి ఆలయ ఛైర్మన్ అలహరి మధుసూదన్ కుమార్ ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. స్వామి వారిని గర్భాలయం నుంచి రథం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చి, రథంపై కూర్చోబెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, కలెక్టర్, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డి, మునిసిపల్ ఛైర్మన్ ఆనంద్‌గౌడ్ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు హారతి ఇచ్చారు. అనంతరం భక్తులు రథాన్ని లాగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొలిచిన వారికి కొంగు బంగారంగా ఉన్న లక్ష్మీ వేంకటేశ్వర స్వామి కృప భక్తులందరిపై ఉండాలని కోరారు. భక్తులందరికీ ఇబ్బందులు కలుగకుండా స్వామి దర్శనం కల్పించాలని ఆలయ కమిటీ సభ్యులకు, రెవెన్యూ, మునిసిపల్, పోలీస్ శాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఈవో శ్రీనివాసరాజు, జడ్పీటీసీ సభ్యురాలు పుల్లారు వెంకటేశ్వరమ్మ, ఎంపీపీ సుధాశ్రీ, వైస్ ఎంపీపీ అనిత, మాజీ ఎంపీపీ సావిత్రి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మల్లు నర్సింహారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు సుధాకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు ధర్మాపూర్ నర్సింహారెడ్డి, పోతన్‌పల్లి మోహన్ రెడ్డి, అనీల్ రెడ్డి, కోటకదిర మాజీ సర్పంచ్ రమ్య, ఓబులాయపల్లి మాజీ సర్పంచ్ చంద్రకళ, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

అశ్వవాహన సేవ

స్వామి వారిని అలంకరించి గరుడ వాహన సేవ నిర్వహించారు. ఆదివారం ఆలయంలో స్వామి వారికి ఆలయ ధర్మకర్త అళహరి మధుసూదన్ కుమార్, అర్చకులు అభిషేకాలు చేశారు. అశ్వవాహన సేవ, ద్వితీయ ప్రభోత్సవం నిర్వహించారు. అనంతరం పల్లకీ సేవ చేపట్టారు.

భవిష్యత్ బీఆర్ఎస్‌దే..

- పార్లమెంటరీ సన్నాహక సమావేశంలో కేటీఆర్



నాగర్‌కర్నూల్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

నాగర్‌కర్నూల్(ఆంధ్రజ్యోతి), ఫిబ్రవరి 25: 'ఒకటిన్నర శాతం ఓట్లతో అధికారం కోల్పోవచ్చు. రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజం. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం, ఆ తర్వాత పదేళ్ల అధికారంలో వంద కిలోమీటర్ల స్పీడ్‌తో దూసుకెళ్లిన కారు సర్వీసింగ్‌కు రావడం సహజమే'నని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట, నాగర్‌కర్నూల్‌లలో ఆదివారం బీఆర్ఎస్ బూత్ కమిటీ సభ్యులతో పార్లమెంటరీ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ కాంగ్రెస్, బీజేపీలను దుయ్యబడుతూనే.. క్యాడర్‌లో మనో ధైర్యాన్ని నింపే ప్రయత్నం చేశారు. తెలంగాణకు ఎంతో మంది సీఎంలు రావచ్చుని కానీ, తెలంగాణ రాష్ట్రం ఉన్నంత వరకు కేసీఆర్ పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. జనం కేసీఆర్‌ను చిరస్మరణీయంగా తమ హృదయాల్లో పదిల పర్చుకుంటారని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎడారిగా ఉన్న విషయం వాస్తవం కాదా? అని అన్నారు. కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు పథకాల ద్వారా జిల్లాను సస్యశ్యామలం చేసినందుకు కాంగ్రెస్‌కు కండ్లు మండుతున్నాయని విమర్శించిన ఆయన బీజేపీ పాలనలో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి ఎందుకు జాతీయ హోదాను కల్పించడం లేదని ఈ ప్రాంత సెంటిమెంట్ రగిలించారు.

బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీ రాములు డుమ్మా

పార్లమెంటరీ సన్నాహక సమావేశాలకు బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీ రాములు డుమ్మా కొట్టారు. కొంతకాలంగా బీఆర్ఎస్ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్న రాములుకు, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజుకు పొసగడం లేదు. ఇదే క్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లాలోని బీఆర్ఎస్‌కు ముగ్గురు మాజీ ఎమ్మెల్యేలు రాములుకు టికెట్ ఇవ్వొద్దని పార్టీ అధినేత కేసీఆర్‌కు బహిరంగంగా చెప్పారు. దాంతో రాములుకు తిరిగి టికెట్ కేటాయించే అంశం డైలామాలో పడింది. ఎంపీగా పోటీ చేసేందుకు గువ్వల బాలరాజు ఆసక్తి చూపుతున్న క్రమంలో బీఆర్ఎస్ అధిష్ఠానం కావాలని సిట్టింగ్ ఎంపీ రాములును దూరంగా ఉంచినట్లు విశ్వసనీయ సమాచారం.

భూసేకరణలో.. మాయాజాలం

- భూముల్లో కొత్తగా షెడ్ల నిర్మాణం
- లేని బావులు, బోర్లు, చెట్లు ఉన్నట్లు గుర్తింపు
- ముంపునకు గురికాని భూములూ లెక్కింపు
- మామూళ్లు తీసుకుని రికార్డులకెక్కించిన రెవెన్యూ అధికారులు
- జెన్‌కోపై భారం


పరిహారం కాజేసేందుకు వరి పొలాల్లో వెలిసిన షెడ్లు

గద్వాల, ఫిబ్రవరి 25: జూరాల దిగువ భాగంలో నిర్మించిన లోయర్ జూరాల జల విద్యుత్ కేంద్రం ఆనకట్ట వల్ల ముంపునకు గురవుతున్న భూముల సేకరణలో అధికారులు మాయాజాలం ప్రదర్శించారు. జల విద్యుత్ ఉత్పత్తి కోసం కృష్ణా నదిపై నిర్మించిన ఆనకట్ట వల్ల భూములు మునిగిపోతున్నాయి. వీటికి పరిహారం చెల్లించేందుకు నిర్ణయించిన జెన్‌కో అధికారులు భూమిని గుర్తించాలని రెవెన్యూ భూ సేకరణ అధికారులకు అప్పజెప్పారు. ఇక్కడే అధికారులు పక్కదారి పట్టారు. భూముల్లో అప్పటి వరకు లేని షెడ్లు కొత్తగా వెలిసినా.. బోర్లు, బావులు, చెట్లు లేకున్నా ఉన్నాయని చెప్పినా, ఉన్న చెట్లు ఎక్కువ చూపినా మామూళ్లు తీసుకుని రికార్డులకు ఎక్కించారు.

2015 నుంచి..

గద్వాల మండలం రేకులపల్లి గ్రామం వద్ద లోయర్ జూరాల జల విద్యుత్ కేంద్రం పనులను 2008లో ప్రారంభించి, 2014లో పూర్తి చేశారు. 2015 నుంచి విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. ఇందుకోసం కృష్ణానదిపై ఆనకట్ట నిర్మించారు. ఈ ఆనకట్ట వల్ల నదీ ప్రవాహం వెనక్కి వెళ్లి, పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయి. ఆనకట్ట వద్ద 299 మీటర్ల ఎత్తులో నీరున్నప్పుడు భూ సేకరణ చేసి, ముంపునకు గురవుతున్న భూములకు అప్పట్లో పరిహారం చెల్లించారు. కానీ నదీ ప్రవాహం మూడు లక్షల క్యూసెక్కుల కంటే ఎక్కువ పెరిగితే రెండువైపులా వందల ఎకరాల్లో భూములు మునిగిపోతున్నాయి. దాంతో పంటలు నీట మునిగి రైతులు పెద్ద ఎత్తున నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో రైతులు పోరాటాలు చేశారు. కలెక్టర్ కార్యాలయం, లోయర్ జెన్‌కో ముందు కార్యాలయం ముందు ధర్నాలు చేశారు. అప్పట్లో తాత్కాలిక ఉపశమనం కింద ఎకరాకు రూ.12 వేల చొప్పున 2015 నుంచి 2018 వరకు పంట పరిహారం ఇచ్చారు. కానీ శాశ్వత పరిష్కారం కావాలని రైతులు ఉద్యమించడంతో భూమిని సేకరించేందుకు జల విద్యుత్ అధికారులు అంగీకరించి, రెవెన్యూ అధికారులకు బాధ్యత అప్పగించారు.

301 మీటర్ల వద్ద 68 ఎకరాల సేకరణ

గతంలో ఆనకట్ట వద్ద 299 మీటర్ల ఎత్తులో నీరున్నప్పుడు ముంపునకు గురయ్యే భూములు సేకరించిన అధికారులు దానిని 301 మీటర్లకు పెంచి, ఏ మేరకు పంట పొలాలు నీట మునుగుతాయో నివేదించాలని రెవెన్యూ అధికారులను కోరారు. ఇందుకోసం సర్వేయర్, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు భూ సర్వే చేశారు. సర్వే నెంబర్ 226, 227, 228, 235, 238, 239, 240, 241, 242, 243, 244, 258, 259, 260, 261, 262, 263, 264, 265, 266, 267, 268, 269, 270లలోని దాదాపు 67.30 ఎకరాలలో భూమి ముంపునకు గురవుతుందని నివేదించారు. అవి దాదాపు 120 మంది రైతులవిగా గుర్తించారు. ఇప్పటి వరకు బాగానే ఉంది. కానీ ఇక్కడే అవినీతికి పాల్పడ్డారు. ఈ భూములు జూరాల కాల్వ కిందివి కావడంతో వీటిలో వరిని మాత్రమే పండిస్తారు. ఇలాంటి భూములలో ఎక్కువ పరిహారం పొందేందుకు అడ్డదారులు తొక్కారు. షెడ్లు నిర్మించడం, లేని చెట్లు, బోర్లు, బావులు ఉన్నట్లు చూపడం వంటివి చేశారు.

పరిహారం కోసం వెలిసిన షెడ్లు

భూ సేకరణ కోసం దాదాపు ఏడాదిన్నర క్రితం సర్వే చేశారు. అప్పటి వరకు ఆ భూములలో ఎలాంటి షెడ్లు లేవు. ఒకరిద్దరు రైతులు చిన్నపాటి గుడిసెలు మాత్రమే వేసుకున్నారు. కానీ సర్వే సమయంలో తాటి దూలాలు, పెంకులతో దాదాపు పది వరకు కొత్త షెడ్లు వేశారు. వాటిలో గొర్రెలు, బర్రెలు పెంచుతున్నట్లు చెప్పారు. కానీ ఏనాడూ వాటిలో గొర్రెలు, బర్రెలను ఉంచలేదు. పరిహారం కాజేసేందుకే ఆ షెడ్లు వేశారని అధికారులకు తెలిసినా.. మామూళ్లు అందడంతో రెవెన్యూ, సర్వే అధికారులు వాటికి ఒకే చెప్పారు. ప్రస్తుతం అక్కడ ఆరు షెడ్లు ఇప్పటికీ ఉన్నాయి. ఒక్కో షెడ్డుకు దాదాపు రూ.5 లక్షలకు పైగా పరిహారం పొందేందుకు బిల్లులు సిద్ధం అయ్యాయి. ఇవే కాకుండా లేని చెట్లను ఉన్నట్లు, ఉన్న చెట్ల సంఖ్య పెంచి చూపించారు. బోర్లు, బావులు కూడా లేనివి ఉన్నట్లు లెక్కల్లో రాశారు. ఇందులో కూడా చేతులు తడిపిన వారికే పెద్దపీట వేశారు. అమాయక రైతులకు అన్యాయం చేశారు. కొందరి రైతుల భూములు ముంపునకు గురవుతున్నా.. భూసేకరణ చేయకపోవడం గమనార్హం.

ఆర్డీవో ఖాతాలో పరిహారం జమ

67.30 ఎకరాల భూమికి పరిహారం ఇచ్చేందుకు లోయర్ జూరాల జల విద్యుత్ అధికారులు సిద్ధమయ్యారు. దాదాపు రూ.ఆరు కోట్ల చెల్లింపులు చేయాల్సి ఉంటుందని అంచనా వేయగా, మొదటి విడతగా వారు రూ.4.32 కోట్లను ఆర్డీవో ఖాతాలో ఈ నెల 17వ తేదీన జమ చేశారు. మిగిలిన మొత్తాన్ని మొదటి విడత పరిహారం పంపిణీ పూర్తయిన తర్వాత చెల్లిస్తామని చెప్పారు. పరిహారం డబ్బులు వస్తున్నాయని తెలియడంతో అక్రమాలు ఒక్కొటి బయటికి వస్తున్నాయి. భూ సేకరణ సమయంలో సర్వేయర్, రెవెన్యూ అధికారులు ఎవరెవరికి అకారణంగా లబ్ధి చేకూర్చారో బహిర్గతమవుతోంది. ఈ విషయమై ఆర్డీవో చంద్రకళను వివరణ కోరేందుకు 'ఆంధ్రజ్యోతి' ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు. జెన్‌కో అధికారులు కలెక్టర్ దృష్టి పెట్టి, ముంపునకు గురవుతున్న వారికే పరిహారం ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.


జల విద్యుత్ ఉత్పత్తి కోసం కృష్ణానదిపై నిర్మించిన ఆనకట్ట

ప్రధానమంత్రికి ప్రజల ఆశీర్వాదం

- బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ


విజయ సంకల్ప యాత్రలో మాట్లాడుతున్న డీకే అరుణ

గద్వాల, ఫిబ్రవరి 25: శ్రీరామచంద్రుడితో పాటు ప్రజల ఆశీర్వాదంతో నరేంద్రమోదీ మూడో సారి ప్రధానమంత్రి కాబోతున్నాడని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. విజయ సంకల్ప యాత్రలో భాగంగా గద్వాల పట్టణంలో ఆదివారం రాత్రి బహిరంగ సభను నిర్వహించారు. అరుణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భారత దేశం ప్రపంచంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా కీర్తించబడుతోందని చెప్పారు. అనేక దేశాలు ప్రధాని మోదీ అడుగు జాడల్లో నడుస్తున్నాయన్నారు. పదేళ్లలో ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలనూ నెరవేర్చిన ఒకే ఒక్క నాయకుడు నరేంద్ర మోదీ అని కొనియాడారు. 370 ఆర్టికల్‌తో పాటు ట్రిపుల్ తలాక్‌ను రద్దు చేసిన వ్యక్తి అని కొనియాడారు. పేదరికాన్ని ప్రారదోలేందుకు ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న వ్యక్తి అని వివరించారు. ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని, కమిటీ వేశారని గుర్తు చేశారు. నెరవేర్చలేని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నాయకులు.. ఆరు గ్యారెంటీలు అమలు కావాలంటే రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి కావాలంటున్నారని, 17 సీట్లతో రాహుల్ ప్రధాని అవుతాడా? అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శ్రుతి మాట్లాడుతూ.. ప్రధాని 500 ఏళ్ల సమస్యను పరిష్కరించి, తన చేతుల మీదుగానే బాలరాముడి ప్రాణప్రతిష్ఠ చేయించారని అన్నారు. మోదీకి శ్రీరాముని ఆశీర్వాదం ఉన్నట్లే.. ప్రజల ఆశీర్వాదం కూడా ఉండాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, యాదగిరిరెడ్డి, డీకే స్నిగ్ధారెడ్డి, రామాంజనేయులు, బండల వెంకట్రాములు, అయ్యపురెడ్డి, రజక జయశ్రీ పాల్గొన్నారు.

నగల దుకాణంలో
ఎనిమిది కేజీల వెండి నగలు అపహరణ

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 25 : నగల దుకాణంలో దొంగలు పడి 8 కేజీల వెండి నగలు అపహరించిన ఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. వన్‌టౌన్ సీఐ భీమ్‌కుమార్ వివరాల ప్రకారం.. వెంకటేశ్వర కాలనీకి చెందిన మాణిక్యప్రసాద్‌కు గడియారం చౌరస్తాలోని బాలాజీ సిల్వర్ ప్యాలెస్ దుకాణం ఉంది. శనివారం రాత్రి దుకాణానికి తాళం వేసి ఇంటికి వెళ్లాడు. ఆదివారం ఉదయం దుకాణం తెరిచేందుకు వచ్చే సరికి తాళాలు తీసి ఉండటం లోపలికి వెళ్లి చూడగా వెండి నగలు పెద్దఎత్తున కనిపించలేదు. దొంగలు పడి దాదాపు 7-8 కిలోల విలువ చేసే నగలు అపహరణకు గురైనట్లు బాధితుడు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఓటు నమోదుకు దరఖాస్తుకు చేసుకోండి

దేవరకద్ర, ఫిబ్రవరి 25 : 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందని, సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసు లు ఓ ప్రకటనలో తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఎన్నికల సంఘం మరోసారి 18 ఏళ్లు నిండి ఓటు హక్కులేనివారికి అవకాశం కల్పించారు. ఓటు హక్కు దరఖా స్తుతో పాటు, మార్పులు, చేర్పులు చేసుకోవచ్చన్నారు.

పందుల పోటీలను అడ్డుకున్న పోలీసులు

- రూ. ఐదులక్షల దాకా బెట్టింగులు కాసిన వైనం
- నిర్వాహకులపై కేసులు నమోదు చేసేందుకు రంగం సిద్ధం



గద్వాలలో పందుల పోటీలకు వచ్చిన జనం

గద్వాల క్రైం, ఫిబ్రవరి 25 : జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో పందుల పోటీల్లో బెట్టింగులు కాస్తున్నారని పట్టణ పోలీసులు ముందుగానే పసిగట్టి అడ్డుకున్నారు. ఇందుకు కారణమైనా వారిపై కేసులు నమోదు చేసేందుకు రంగం సిద్ధమైనట్లు సమాచారం. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం గద్వాల జిల్లా కేంద్రంలోని సంగాల చెరువులో కొందరు చోట నాయకులు అండదండలతో పందుల పోటీలను ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం చేశారు. అయితే ఇందులో గద్వాల జిల్లాతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి పందులను తీసుకొచ్చి పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిసింది. తమ నాయకులకు పోలీసుల మధ్య సంబంధాలు మెండుగా ఉన్నాయని ఈ చోటా నాయకులు ఈ పోటీలను ప్రారంభించారు. అయితే ఇందులో కేవలం పోటీలు మాత్రమే కాకుండా పందుల పోటీల పేరుతో రూ. లక్షల్లో బెట్టింగులు కూడా కాశారు. ఈ విషయాలను తెలుసుకున్న పట్టణ ఎస్‌ఐ సంఘటన స్థలానికి చేరుకొని కొందరు నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై పట్టణ ఎస్‌ఐ శ్రీనివాస్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా పందుల పోటీలకు ఎలాంటి అనుమతులు లేవని, అందుకే నిర్వాహకులపై పూర్తి స్థాయిలో విచారించి వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమావేశమైన పూర్వ విద్యార్థులు

నవాబ్‌పేట, ఫిబ్రవరి 25 : మండలంలోని కొల్లూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 2005-06 సంవత్సరానికి చెందిన విద్యార్థులు ఆదివారం వారు చదువుకున్న పాఠశాలలో సమావేశమయ్యారు. నాటి తీపి గుర్తులను నెమరు వేసుకున్నారు. వారికి చదువులు చెప్పిన ఉపాధ్యాయులు వాసుదేవ రెడ్డి, లక్ష్మన్, మజహర్, సుధాకర్, ఎర్రన్న, మజరుల్లా, సత్యనారాయణరెడ్డి, మాధవిలను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకున్నప్పుడే పాఠాలు చెప్పిన తమకు ఎంతో సంతోషం ఉంటుందన్నారు. 18 సంవత్సరాల తర్వాత అందరూ కలవడం సంతోష కరమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో గణేష్, బాలరాజు, నరేష్, మల్లికార్జున్, పవన్, రామకృష్ణ, పాండు, కృష్ణ కుమార్, నరేందర్, యాదయ్య, నర్సింహులు, రవికుమార్, శ్రీను, వెంకటేష్, శ్రీశైలం, ఆంజనేయులు, కృష్ణ, మల్లేష్, నర్సింహులు, సత్యం, ఆంజనేయులు, నవత, పుష్పలత, శ్వేత, మహేశ్వరి, సునిత, అలివేలమ్మ, సుమతి, శశికళ, రమాదేవి, జయమ్మ, రజిత, సంధ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా మహేందర్

హన్వాడ, ఫిబ్రవరి 25 : కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షు డిగా హన్వాడకు చెందిన రిటైర్డ్ ఆర్మీ జవాన్ మహేందర్‌ను జిల్లా పార్టీ నియమించింది. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం లో నియామకపత్రాన్ని అందు కున్నారు. నూతన అధ్యక్షుడిగా మహేం దర్, ప్రధాన కార్యద ర్శిగా రాజునాయక్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా చెన్నయ్య లను నియమిస్తూ జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రి అందించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ ఎమ్మె ల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలని వారికి ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సురేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, వెంకటయ్య, షబ్బీర్, దాసరి వెంకటయ్య పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ ప్రవేశ ప్రతిభ పరీక్ష

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఫిబ్రవరి 25 : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలల్లో మొదటి ఏడాది ప్రవేశ ప్రతిభ రెండవ స్క్రీనింగ్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. పరీక్ష కేంద్రాలను గురుకులాల ప్రాంతీయ సమన్వయాధికారి ఫ్లారెన్స్‌రాణి పర్యవేక్షించారు. రీజియన్ పరిధిలోని గద్వాల జిల్లాలో ఏర్పాటు చేసిన 2 కేంద్రాలలో 566 మంది విద్యార్థులకుగాను 543 మంది హాజరుకాగా, మహబూబ్‌నగర్ జిల్లా ఒకపరీక్ష కేంద్రంలో 462 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 439 మంది హాజరయ్యారని, నారాయణపేట జిల్లాలో ఒక కేంద్రంలో 390 మందికి గాను 660 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. మొత్తం 95.03 శాతం మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. ఈ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది.

బాధిత కుటుంబానికి రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

- ఆందోళనలో సీఐటీయూ నాయకులు



ఎవర్టోజెన్ పరిశ్రమ ముందు ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

జడ్చర్ల, ఫిబ్రవరి 25 : మండలంలోని పోలేపల్లి ఎవర్టోజెన్ పరిశ్రమలో కార్మికునిగా పనిచేస్తున్న చంద్రశేఖర్ (33) ప్రమాదవశాత్తు మృతి చెందాడు. మృతి చెందిన కుటుంబానికి రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కంపెనీ ముందు సీఐటీయూ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి సత్తయ్య మాట్లాడుతూ మృతి చెందిన చంద్రశేఖర్ కుటుంబాన్ని పరిశ్రమ కంపెనీ ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇండస్ట్రియల్ యాక్టు ప్రకారం కర్మాగారాల్లో కార్మికుల భద్రత ప్రాణరక్షణకు సంబంధించిన అంశాల గురించి వివరించారు. మృతునికి భార్య వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారని వారు కూడా మైనర్లుగా ఉన్నారని అన్నారు. పేద కుటుంబాన్ని కంపెనీ యాజమాన్యం ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వమే 90 శాతం రాయితీ ఇస్తోందని, కేవలం కంపెనీ నుంచి పది శాతమే యాజమాన్యం వహిస్తుందని అన్నారు. వారి బయోడేట కూడా తీసుకోవడం లేదని, కంపెనీలలో స్థానికుల గురించి ఉన్నాయా, లేక ఇతర రాష్ట్రాల వారికి ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణయ్య, మృతుని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో జిల్లాకు రెండు పతకాలు



రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పతకాలు అందుకున్న జిల్లా క్రీడాకారులను అభినందిస్తున్న అథ్లెటిక్స్ అసోసియేషన్ నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్, ఫిబ్రవరి 25: రాష్ట్ర స్థాయిలో జరిగిన పోటీల్లో జిల్లాకు చెందిన ఇద్దరు అథ్లెట్లు రాత్లావత్ కీర్తన, నక్షత్ర పతకాలు సాధించి ప్రతిభ కనబరిచారు. ఆదివారం హైదరాబాదులో జరిగిన తెలంగాణ స్టేట్ 400 మీటర్ల అథ్లెటిక్స్ ఛాంపియన్స్ పోటీ అండర్-16 బాలికల విభాగంలో పరుగు పందెంలో కీర్తన బంగారు పతకం సాధించగా నక్షత్ర మూడవ బహుమతి గెలుచుకుంది. రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారుల పతకాలు సాధించడం పట్ల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు విజేందర్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి సోలపోగుల స్వాములు, ఉపాధ్యక్షులు లావణ్యరెడ్డి, లక్ష్మీ, బిక్షపతి, కోచ్ పరుశురాములు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు.

విద్యార్థి ఆత్మహత్య



సాక నరేశ్ (ఫైల్)

మద్దూర్, ఫిబ్రవరి 25 : తల్లి మందలించిందని ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాదసంఘటన ఆదివారం నారా యణపేట జిల్లా మద్దూర్ మండల కేంద్రంలో జరిగింది. ఎస్ఐ రాంలాల్ తెలిపిన వివరాలి లా ఉన్నాయి. మండలంలోని కోటకుండకు చెందిన అనిత కుటుంబం జీవనోపాధి కోసం కొన్నేళ్లుగా మద్దూర్ పట్టణంలో నివసిస్తోంది. ఇంటర్ చదువుతున్న ఆమె కుమారుడు సాక నరేశ్ (17) శనివారం రాత్రి ఆలస్యంగా ఇంటికి రావడంతో మందలించింది. దీంతో మనస్తాపం చెందిన నరేశ్ ఆదివారం ఉదయం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పనిమీద బయటకు వెళ్లిన అనిత ఇంటికి తిరిగొచ్చేసరికి నరేశ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని కన్పించాడు. దీంతో వెంటనే ఆమె 108కు సమాచార మందించి, నారాయణపేట ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెంది నట్లు వైద్యులు నిర్ధారించారు. తల్లి అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాంలాల్ తెలిపారు.

జడ్చర్లలో వైభవంగా శకటోత్సవం



వేంకటేశ్వరస్వామి దేవాలయం చుట్టూ ట్రాక్టర్ల ఊరేగింపు

జడ్చర్ల, ఫిబ్రవరి 25 : పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం రాత్రి రథాన్ని పుష్పాలతో అలంకరించి ఉత్సవ విగ్రహాలను రథంపై ఉంచి భక్తులు రథాన్ని లాగి మొక్కులు తీర్చుకున్నారు. గురువారం ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం శకటోత్సవం (బండ్లు, ట్రాక్టర్లు తిరిగే) కార్యక్రమం నేత్రపరంగా సాగింది. వాహనాలు ఆలయం చుట్టూ తిరిగా యి. ఉత్సవాలకు వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్త భీంసేనాచారి, సురేంద్రచారి, రామకృష్ణశర్మ, భక్తులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడిపై కేసు నమోదు

- పోలీస్‌స్టేషన్‌కు వచ్చి సమాచారం సేకరించిన ఎమ్మెల్యే విజయుడు



అయిజ పోలీస్‌స్టేషన్ ముందు గుమిగూడిన బీఆర్ఎస్ కార్యకర్తలు

అయిజ, ఫిబ్రవరి 25: జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణ పోలీస్‌స్టేషన్ ముందు ఆదివారం రాత్రి ఉత్కంఠ భరిత వాతావరణం చోటుచేసుకుంది. ఉత్తనూరు ధన్వంతరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో వంశ పారంపర్యంగా అర్చకుడు భరత్‌ను శనివారం రాత్రి బీఆర్ఎస్ నాయకుడు రామచంద్రారెడ్డి గల్లాపట్టి బయటికి గెంటి వేసిన ఘటనపై కేసు నమోదు అయ్యింది. ఆదివారం సాయంత్రం రామచంద్రారెడ్డిని సాయంత్రం పోలీస్టేషన్‌కు పిలిపించారు. ఇది తెలిసిన అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అయిజ పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. ఎస్ఐతో మాట్లాడి విషయం తెలుసుకున్నారు. ఇది తెలిసిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో తరలిరావడంతో ఉత్కంఠ భరిత వాతావరణ నెలకొంది. ఎస్ఐతో మాట్లాడి రామచంద్రారెడ్డిని బయటకు తీసురావటంతో సమస్య సద్దుమణిగింది. ఎస్ఐ విజయ్‌భాస్కర్ మాట్లాడుతూ విచారణ నిమిత్తమే పోలీస్‌స్టేషన్‌కు పిలిపించామన్నారు.

చలానాలు జానా్తై

- జోగులాంబ గద్వాల జిల్లాలో ఇటుక వ్యాపారుల అడ్డగోలు రవాణా
- మైనింగ్ అధికారుల కళ్లు కప్పి అక్రమ వ్యాపారం
- వాహనాలను పట్టుకుంటున్న అధికారులు
- చలానాల చెల్లింపు తర్వాతే వాహనాల రిలీజ్
- వ్యాపారులతో కింది స్థాయి సిబ్బంది బేరసారాలు

గద్వాల క్రైం, ఫిబ్రవరి 25 : ఇటుక వ్యాపారులు ఇటుకలను సరఫరా చేసే క్రమంలో కొంత రుసుమును(రాయల్టీ) చలానాల రూపంలో రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతీ ఏడాది చెల్లించాల్సి ఉంటుంది. లక్ష ఇటుకలను తరలించే వ్యాపారులు ప్రతీ ఏడాది రూ.6500లను ప్రభుత్వానికి చలానా రూపంలో తప్పక చెల్లించాలని ప్రభుత్వం మైనింగ్ శాఖకు ఆదేశాలు జారీ చేసింది. అయితే ఇవేమీ పట్టని వ్యాపారులు మైనింగ్ అధికారుల కన్ను కప్పి ఇటుకలను రవాణా చేస్తున్నారు. సంబంధిత అధికారు లూ దాడులు చేసి వాహనాలను పట్టుకుంటూ వాటికి రాయల్టీతో పాటు, జరిమానాలను కూడా విధిస్తున్నారు.

ఇటుక బట్టీలకు అనుమతులు తప్పనిసరి

జోగుళాంబ గద్వాల జిల్లాలో అక్రమంగా ఇటుక బట్టీలు వెలుస్తూనే ఉన్నాయి. బట్టీలు ఏర్పాటు చేయాలంటే ఇందుకు సంబంధించి ప్రభుత్వ స్థలంలో కానీ, పట్టా పొలంలో కానీ ఫారెస్ట్, లేబర్, మైనింగ్, ఎలక్ట్రిసిటీ, రెవెన్యూ పొల్యూషన్, స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ సంబంధిత శాఖల అధికారుల అనుమతులు తీసుకొని తర్వాత తహసీల్దార్‌కు పంపించాల్సి ఉంటుంది. చివరకు తహసీల్దార్ పరిశీలించి, ఎన్‌వోసీ లెటర్‌ను అందజేస్తే అప్పుడు ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. కానీ ఇవేమీ లేకుండా జిల్లాలో కొన్ని అక్రమంగా వెలిసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గద్వాల జిల్లా కేంద్రంతో పాటు, ఇటి క్యాల, మల్దకల్, అయిజ మండలాల్లో ఎక్కువగా ఇటుక బట్టీలు ఉన్నట్లు తెలుస్తుంది. కానీ ఇందులో కొన్ని మా త్రమే అనుమతులు ఉన్నాయని.. కొందరు అనుమతులు తీసుకోకుండా అక్రమంగా ఏర్పాటు చేసుకున్నట్లు అధికారులు తెలుపుతున్నారు.

18 ట్రాక్టర్లను పట్టుకున్న అధికారులు

ప్రభుత్వానికి రాయల్టీ కట్టకుండా ఇటుకలను తరలిస్తున్న 18 ట్రాక్టర్లను జిల్లాలో ఐదురోజుల క్రితం మైనింగ్ శాఖ అధికారులు దాడులు నిర్వహించి, పట్టుకున్నారు. వాహనాలను ఆయా పరిధిలోని పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు. అయితే సంబంధిత శాఖలోని కొందరు కాంట్రాక్టు సిబ్బంది తమ చేతివాటాన్ని ప్రదర్శించి వాహనాలను వదిలేసినట్లు సమాచారం. ఇలా వదిలేసిన వాహనాల్లో గద్వాల మండలం పూడూరు ఎర్రవల్లికి చెందిన ఓ వ్యక్తి ట్రాక్టర్, అలాగే వీరాపురం గ్రామానికి చెందిన మరో వ్యక్తి ట్రాక్టర్‌కు నజరానా పుచ్చుకొని వదిలేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గద్వాల పట్టణంలో ఐదు, వడ్డేపల్లి మండలంలో మూడు, గట్టు మండలంలో ఐదు, ఇటిక్యాల పరిధిలో ఐదు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు మైనింగ్‌శాఖ అధికారి విజయరామరాజు తెలిపారు. వీరి నుంచి ప్రభుత్వానికి చెల్లించిన చలానాల తర్వాత వాటిని విడుదల చేసినట్లు ఆయన చెప్పారు.



గద్వాల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పట్టుబడ్డ ఇటుక ట్రాక్టర్లు(ఫైల్)

చేతివాటం ప్రదర్శిస్తున్న కాంట్రాక్ట్ సిబ్బంది

గద్వాల జిల్లాలోని మైనింగ్ శాఖలో కాంట్రాక్ట్ సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ చేతివాటాలు ప్రదర్శిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక్కడి అధికారులు అండదండలు లేకపోతే వారికి తెలియకుండా చేస్తున్నారో తెలియదు కానీ రెగ్యులర్ ఉద్యోగుల కంటే వీరిదే పైచేయి అని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మైనింగ్ అధికారులు దాడులు చేసి ట్రాక్టర్లను పట్టుకున్నా, పోలీసులు దాడులు చేసి మట్టి ట్రాక్టర్లను పట్టుకున్నా అనుమతుల కోసం మళ్లీ మైనింగ్ శాఖ ఉద్యోగులను సంప్రదించి వారినుంచి రిలీజ్ ఆర్డర్ తీసుకోవాల్సి ఉంటుంది. అయితే, ఈ తతంగాన్ని మొత్తం నడిపేందుకు గాను కాంట్రాక్ట్ సిబ్బంది లావాదేవీలు నడుపుతున్నట్లు తెలుస్తోంది. వీరికి కొంత మామూలు ఇస్తే చాలు ఇక ప్రభుత్వానికి చలాన్లు కూడా కట్టనవసరం లేకుండానే వాహనాలను వదిలేసేలా లెటర్లు పంపిస్తున్నారు. ఈ వ్యవహారం మొత్తం నడిపించేందుకు వాహనయజమానులు ఉన్న చోటుకే వీరు వచ్చి సెటిల్ చేసుకుంటున్నట్లు సమాచారం.

బేరసారాల విషయం తన దృష్టికి రాలేదు



తమ కార్యాలయంలో పని చేసే సిబ్బంది ఇటుక, మట్టి వ్యాపారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న విషయం నా దృష్టికి రాలేదు. ఒకవేళ ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటాం. గతేడాది జనవరి నుంచి ఇప్పటివరకు మట్టి, ఇటుకలను సరఫరా చేసే వారినుంచి ప్రభుత్వా నికి టాక్స్ రూపంలో రూ.20 లక్షల దాకా వసూలు చేశాం. ఇటుక వ్యాపారులు ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించకుంటే చర్యలు తప్పవు. ఇటుక బట్టీలు వేసేవారు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలి, లేకపోతే చర్యలు తీసుకుంటాం.

- విజయరామరాజు, మైనింగ్ శాఖ అధికారి, గద్వాల

రైతును రాజు చేయడమే ధ్యేయం

- సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సీడబ్ల్యూసీ ప్రత్యేక అహ్వానితుడు వంశీచందర్‌రెడ్డి

మక్తల్, ఫిబ్రవరి 25 : రైతును రాజుగా చేయడమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయం అని, కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ప్రాజెక్టులతోనే ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో సాగునీరు అందుతోందని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, పార్లమెంటు ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితో కలిసి సంగంబండ రిజర్వాయర్‌ను పరిశీలించి, పునరావాస బాధితులను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గతంలో ఎన్నో ప్రాజెక్టులు నిర్మించామన్నారు. జలయజ్ఞం కింద ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సాగునీరు అందించామన్నారు. ఇప్పటి వరకు కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ప్రాజెక్టుల ద్వారానే సాగునీరు అందుతోందన్నారు. సంగంబండ రిజర్వాయర్ కింద 62 వేల ఎకరాలకు సాగునీరందించేందుకు చర్యలు చేపట్టగా, గతంలో ఉన్న అసమర్థ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి నిర్వాకంతో బండ తొలగించకపోవడంతో ఎడమలో లెవల్ కెనాల్ కింద 12 గ్రామాలకు దాదాపు 20 వేల ఎకరాలకు సాగునీరు అందలేదన్నారు. సంగంబండ, ఉజ్జెల్లి, గార్లపల్లి వాసులకు నష్ట పరిహారం కింద రూ.32 కోట్లు చెల్లించాల్సి ఉండగా నిర్లక్ష్యం వహించారన్నారు. అతి త్వరలో బండ తొలగించి ఎడమ లో లెవల్ కెనాల్ పరిధిలో 20 వేల ఎకరాలకు సాగునీరందిస్తామన్నారు. పునరావాస కేంద్రంలో అపరిష్కృతంగా ఉన్న అన్ని సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఈ విషయంపై ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి, సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కకు ధన్యవాదాలు తెలిపారు. అంతకుముందు పట్టణంలోని పడమటి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ వనజ ఆంజనేయులు గౌడ్, జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్‌రెడ్డి, నాయకులు బాలకృష్ణారెడ్డి, గవినోళ్ల గోపాల్‌రెడ్డి, రవికుమార్ యాదవ్, లక్ష్మారెడ్డి, నాగరాజు గౌడ్, మండలాధ్యక్షుడు గణేష్ కుమార్, పట్టణ అధ్యక్షుడు రవికుమార్, నాయకులు కట్ట సురేష్‌కుమార్ గుప్తా, గడ్డంపల్లి హన్మంతు, రాజప్పగౌడ్, కావలి తాయప్ప, మందుల నరేందర్, రవీందర్, వాకిటి హన్మంతు, శివరాం రెడ్డి, రంజిత్ రెడ్డి, కల్లూరి గోవర్దన్, గుంతలి రవి పాల్గొన్నారు.

భారత్‌మాల బాధితులకు న్యాయం చేస్తాం

భారత్‌మాల బాధితులకు న్యాయం చేసామని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, పార్లమెంటు ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో భారత్‌మాల బాధితులు వంశీచంద్‌రెడ్డి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోట్ల రూపాయల విలువైన తమ భూములు భారత్‌మాలలో కోల్పోతున్నామని తమకు మార్కెట్ ధర ప్రకారం పరిహారం అందించాలన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి రైతులకు న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో నారాయణపేట సీపీఐ జిల్లా కార్యదర్శి కొండన్న, భారత్‌మాల బాధితులు రంకుల రామలింగం, ప్రసాద్, చిన్నదాసరి నర్సిములు, వెట్టిపల్లి వెంకటప్ప, శేఖర్, శంశుద్దీన్, గోకరప్ప, వెంకటప్ప, గోవిందు, దామోదర్‌రెడ్డి, గొల్ల రాములు, కిష్టప్ప పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్‌ను ఓడించడమే లక్ష్యం

- ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి
- మహబూబ్‌నగర్‌కు చేరిన మాదిగల జోడోయాత్ర



పాలమూరుకు చేరుకున్న మాదిగల జోడో యాత్ర

పాలమూరు, ఫిబ్రవరి 25 : రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్‌ను ఓడించి మాదిగలను గెలిపించుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. 21వ తేదీన హైదరాబాద్‌లో చేపట్టిన మాదిగల జోడోయాత్ర మెదక్, నిజామాబాద్, అదిలాబాద్, పెద్దపల్లి, కరీంనగర్, నార్సింగ్‌ల మీదుగా ఆదివారం సాయంత్రం పాలమూరుకు చేరుకుంది. ఏనుగొండ దగ్గర అంబేడ్కర్ విగ్రహం దగ్గర ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్ విషపు మాటలను తెలంగాణ సమాజం గుర్తెరిగి మెలగాలన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీకి ఓటేస్తే తెలంగాణ రాష్ట్రమంతా కల్లోలమవుతుందన్నారు. కింది జాతుల అణచివేతతో రాష్ట్రం సంక్షోభంలోకి వెళుతుందన్నారు. సబ్బండ కులాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ప్రజలను గెలిపించాలన్నారు. కేంద్రంలోని బీజేపీపై ఏనాడూ బీఆర్ఎస్ ఒత్తిడి చేయలేదన్నారు. మాదిగలకు 12శాతం రిజర్వేషన్ కోసం చట్టబద్ధత కల్పించాలనేదే మాదిగల జోడోయాత్ర లక్ష్యమన్నారు. 1994 జనాభా లెక్కలు, 2014 సమగ్ర కుటుంబ లెక్కల ప్రకారం మాదిగలకు రిజర్వేషన్ కల్పించాలని కోరారు. తెలంగాణలో రెండు ఎంపీ స్థానాలు, ఒక జనరల్ స్థానం మాదిగలకు కేటాయించాలని వివిధ పార్టీలను డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ, నామినేటెడ్ పదవుల్లో జనాభా దామాషా ప్రకారం మాదిగలకు ఎక్కువ స్థానాలు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో మాదిగ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గడ్డమీది గోపాలకృష్ణ, బొర్ర సురేష్, రామస్వామి, రాయికంటి రాందాసు, సింగిరెడ్డి పరమేశ్వర్, గడ్డ యాదయ్య, గజ్జల మల్లికార్జున్, చంద్రశేఖర్, బోరెల్లి సురేష్, ఉపేందర్, ఎం.నరసింహారావు, మహేష్, నరేష్, రమేష్, గణేష్ పాల్గొన్నారు.

తప్పుడు వార్తలపై మంత్రి జూపల్లి పీఏ ఫిర్యాదు



పెద్దకొత్తపల్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న మంత్రి పీఏ నిరంజన్

పెద్దకొత్తపల్లి, ఫిబ్రవరి 25: తనపై అసత్యపు ఆరోపణలు చేస్తూ సోషల్ మీడియాలో ప్రచారం చేసిన వారిపై చర్యలు తీసుకో వాలని మంత్రి జూపల్లి కృష్ణారావు పీఏ నిరంజన్ ఆదివారం పెద్దకొత్తపల్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నియోజవర్గ పరిధిలోని చిన్నంబావి మండల కేంద్రంలో ఓ రైస్ మిల్లులో అక్రమంగా రాత్రి వేళలో కొందరు వడ్ల దొంగతనం చేశారు. వారిని స్థానిక పోలీసులు పట్టుకున్నారు. అయితే ఇందులో మంత్రి జూపల్లి పీఏ ఉన్నాడని, ఆయన ఆధ్వర్యంలో వ్యవహారం జరిగిందని రాసి కొందరు సోషల్ మీడియా, వాట్సప్ గ్రూప్‌లో పోస్టు చేశారు. దీనిని ఆయన తీవ్రంగా ఖండించారు. ఆదివారం పెద్దకొత్తపల్లి పోలీసుస్టేషన్‌లో నేరుగా ఎస్ఐకి ఫిర్యాదు చేశారు. తనపై తప్పుడు వార్తలు రాసి పోస్టు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. అప్పటికే స్టేషన్‌కు కాంగ్రెస్ నాయకులు భారీగా చేరుకున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఉప్పునుంతల, ఫిబ్రవరి 25: నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండల పరిధిలోని డిండి - చింతపల్లి గ్రామానికి చెందిన దూదేకుల సోయేల్‌కు చెందిన ట్రాక్టరు ద్వారా ఆదివారం ఉదయం మండల పరిధిలోని జప్తిసదగోడు గ్రామ సమీపంలోని దుందుభీ వాగు నుంచి అక్రమంగా ఇసుకను తిర్మలాపూర్ వైపు తరలిస్తున్నాడు. పోలీసులు రమేష్, రాములు పట్టుకొని పరిశీలించగా ఎలాంటి అనుమతులు లేకపోవడంతో ట్రాక్టరును పోలీస్‌స్టేషన్ తరలించారు. ఏఎస్సై అంజయ్య కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పాలమూరులో అంతర్జాతీయ ప్రమాణాలో క్రికెట్ మైదానం



విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న ఎమ్మెల్యే యెన్నం తదితరులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, ఫిబ్రవరి 25 : పాలమూరులో అంతర్జాతీయ ప్రమాణాలతో మహబూబ్‌నగర్ జిల్లా క్రికెట్ మైదానాన్ని ఏర్పాటు చేస్తామని ఇక్కడి క్రీడాకారులకు అంతర్జాతీయ ప్రమాణాలతో శిక్షణ ఇ చ్చేందుకు శిక్షకులను ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీ నివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే యె న్నం శ్రీనివాస్‌రెడ్డి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్ పాల్గొని విజేతలకు బహుమతులు, మె మెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెలే మాట్లాడుతూ మహబూబ్‌నగర్ జిల్లాకు క్రికెట్‌కు సెపరేట్ టీం లేకపోవడం క్రీడాకారుల భారీగా నష్టపోతున్నారన్నారు. జిల్లా కేంద్రంలో రూ.15 కోట్లతో హైదరాబాద్ జింఖానా మైదానం తరహాలో క్రికెట్ మైదానాన్ని అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. జిల్లాకు చెందిన క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో రాణించాలన్నారు. అనంతరం విన్నర్, రన్నర్‌గా నిలిచిన అయ్యప్ప-11, రమేష్‌రెడ్డి -11 జట్లకు మెమెంటోలు, క్యాష్ ప్రైజ్‌లను అందజేశారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, నాయకులు సిరాజ్‌ఖాద్రి, సురేందర్‌రెడ్డి, లక్ష్మన్ యాదవ్, సతీష్, చక్రి, రాము పాల్గొన్నారు.

పశుగ్రాసం కొరతతో ఇక్కట్లు



నాగార్జున సాగర్ నుంచి నల్లమలకు ట్రాక్టర్‌లో వరిగడ్డిని తీసుకొస్తున్న రైతులు

మన్ననూర్, ఫిబ్రవరి 25: నల్లమల ప్రాంతంలోని అమ్రాబాద్, పదర మండలాల్లో పశుగ్రాసం కొరత ఏర్పడడంతో రైతులు, పశుపోషకులు అధిక ధరలు వెచ్చించి నాగార్జునసాగర్ కెనాల్ ప్రాంతాలనుంచి వరి గడ్డిని తీసుకువస్తున్నారు. ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడం వలన గడ్డి కొరత ఏర్పడింది. కొందరు పశువుల మందల ను నదీ జలాలు పారే ప్రాంతాలకు మేత కోసం తీసుకెళుతుండగా, మరికొం దరు పాడిగేదె, ఆవులను పోషించే యజమానులు, రైతులు ఒక్కో ట్రాక్టర్ వరిగడ్డిని రూ.6000 వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. పశువుల ఆకలి తీర్చేందుకు పశుగ్రాసాన్ని ఉచితంగా సరఫరా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

వెంచర్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

- ఆల్ ఇండియా కిసాన్ సంఘ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అల్వాల్‌రెడ్డి

బాలానగర్, ఫిబ్రవరి 25 : ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వెంచర్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా కిసాన్ సంఘ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అల్వాల్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పెద్దాయపల్లి గ్రామ శివారులో సర్వేనెం. 102లో సుమారు 20గుంటలు, సర్వే నెం.105లో 26 గుంటల ప్రభుత్వ భూమి ఉందని ఆ యన పేర్కొన్నారు. 2003 సంవత్సరంలో రికావలి మ్యాగ్నెటిక్ అనే ఓ రియల్ సంస్థ సుమారు 19 ఎకరాలలో నూతనంగా వెంచర్ ఏర్పాటు చేసిందని ఆయన తెలిపారు. ఈ వెంచర్‌కి సమీపాన ఉన్న ప్రభుత్వ భూ మిని ఆక్రమించి వెంచర్ చుట్టూ ప్రహరీ నిర్మించారని తెలిపారు. ఈ భూ మి ఆక్రమణను నిరసిస్తూ 20 రోజుల క్రితం గ్రామస్థులు తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. సుమారు రూ. కోటి విలువగల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సంబంధిత రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమిని కాపాడాలని, లేనిచో ఆందోళన కార్యక్రమం చేపడతామని ఆయన హెచ్చరించారు.

ఎంపీ అభ్యర్థిగా మల్లు రవి పేరును ప్రకటించాలి



అభయాంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న నాయకులు

ఊర్కొండ, ఫిబ్రవరి 25: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు డాక్టర్ మల్లురవి పేరును ప్రకటించాలని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు వెంకటయ్య గౌడ్ కోరారు. ఆదివారం మండలంలోని ఊర్కొండపేట అభయాంజనేయ స్వామి ఆలయంలో మల్లురవి పేర కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిశలు కృషిచేసి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి తనవంతు ప్రయత్నం చేసిన డాక్టర్ మల్లురవిని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించాలని అధిష్ఠానాన్ని కోరుతున్నామన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆయనను గెలిపించుకోవడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ కార్యదర్శులు దారా బంగారయ్య, గోవిందు శ్రీనివాసులు, మండల సేవాదళ్ అధ్యక్షుడు పొలె గణేష్, నాయకులు శ్రీనివాసులు, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

● మన్ననూర్: కాంగ్రెస్ పార్టీలో క్రమ శిక్షణ కల్గిన నాయకుడిగా గుర్తింపు ఉన్న డాక్టర్ మల్లురవికే నాగర్‌కర్నూలు పార్లమెంటు టికెట్‌ను ఇవ్వాలని ఎంపీటీసీ సభ్యుడు దాసరి శ్రీనివాసులు, కోఆప్షన్ సభ్యుడు రహీం కోరారు. వారు అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సర్గీయ మల్లు అనంతరాములు సోదరుడైన మల్లు రవి ఎంపీగా ప్రజలకు ఎన్నో సేవలు చేశారని, కాంగ్రెస్ అధిష్ఠానం ఆయనకే టికెట్ ఖరారు చేస్తే అఖండ మెజారిటీతో గెలుస్తాడని అన్నారు. డీసీసీ కార్యదర్శి సంభు వెంకట్‌రమణ, కాంగ్రెస్ నాయకులు తుల్యా నాయక్ , జూలూరి సత్యనారాయణ, జాకీర్, శివాజి, రహిమాన్ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో జగ్నేకీరాత్

మన్ననూర్, ఫిబ్రవరి 25: అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామంలోని జామే మసీదులో జగ్నేకీరాత్ పర్వదినం సందర్భంగా ఆదివారం రాత్రి ముస్లింలు జాగరణ కార్యక్రమం నిర్వహించారు. మత గురువులైన ఇమామ్‌లతో కలిసి ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పలువురు ఒక రోజు ఉపవాస దీక్ష చేపట్టారు. మసీదు కమిటీ అధ్యక్షుడు నసీరొద్దీన్, వాజీద్ అలి, జావేద్ అలి, రహీం, జాకీర్ షరీఫ్, బాబలి, బాబ, రహిమాన్ , నిరంజన్, జహంగీర్ అలి, సాజన్ తదితరులు పాల్గొన్నారు.

మిర్చి ఏరేందుకు కూలీల కొరత

మన్ననూర్, ఫిబ్రవరి 25: నల్లమల ప్రాంతంలోని అమ్రాబాద్, పదర మండలాల పరిధిలో రైతులు ఈ ఏడాది అత్యధిక విస్తీర్ణంలో మిర్చి పంటను సాగు చేశారు. నెల రోజులుగా రైతులు మిరపకాయలు తీసే పనిలో నిమగ్నమై ఉన్నారు. కూలీల కొరత ఏర్పడడంతో రైతులు ట్రాక్టర్లు, ఆటోలు, జీపుల ద్వారా గ్రామాల నుంచే కాక ఇతర మండలాల నుంచి కూలీలను తీసుకువస్తున్నారు. రోజు కూలీ ధర రూ.400 ఉండగా, రైతులు ప్రస్తుతం రూ. 600 చెల్లిస్తూ, రవాణా ఖర్చులు, భోజన ఖర్చులు భరిస్తున్నారు. ఇంత చేసినా మిర్చికి మద్దతు ధర సరిగ్గా లేదని రైతులు వాపోయారు.

పెండింగ్ రుణాలు విడుదల చేయాలి

నాగర్‌కర్నూల్ టౌన్, ఫిబ్రవరి 25: గత ఆరు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ కార్పొరేషన్ రుణాలను వెంటనే విడుదల చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పులిజాల పరుశురాములు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో కేవీపీఎస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పులిజాల పరుశురాములు మాట్లాడుతూ గత ప్రభుత్వం దళిత బంధు పేరుతో మంజూరీ అయిన ఎస్సీ కార్పొరేషన్ రుణాలను పెండింగ్‌లో పెట్టిందన్నారు. గ్రామాల్లో అంటరానితనం రూపుమాపడానికి తీసుకువచ్చిన 12/35 జీవో ఎక్కడా అమలు కావడం లేదన్నారు. ప్రతీ నెల 30 తేదీన పౌర హక్కుల దినం నిర్వహించి మండల స్థాయిలో తహసీల్దారు, ఎంపీడీవో, ఎస్‌ఐ ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న, ఉపాధ్యక్షుడు హనుమంతు, నాయకులు భాస్కర్, జనగ్, వంకేశ్వరం ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీరప్ప పండుగ

కోడేరు, ఫిబ్రవరి 25 : కోడేరు మండల పరిధిలోని మాచుపల్లి గ్రామంలో కురువ కులస్థులు బీరప్ప పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం బీరప్ప గుడి ఆవరణలో పెద్దపటం వేసి కురువ (కిల్లె) కులస్థులు పటంపై కూర్చున్నారు. కురువ కులస్థులు తమ తమ బంధువులను పరిచయస్తులను ఆహ్వానించి వారి చేతితో బండారు (పసుపు) వేయించుకొని తమ వారు అందరు పిల్లపాపాలతో సుఖ సంతోషాలతో, అష్ట ఐశ్వర్యాలతో విరాజిల్లాలని కోరుకున్నారు. వారి వారి బంధువులు నూతన వస్త్రువులు వారికి అందించారు. దేవుని ఆశీస్సులు ఉండాలని కొరుకున్నారు. కులస్థులు నాగేంద్రం, మల్లయ్య ఎల్లయ్య, బాలమ్మ, బిచ్చమ్మ అలివేలు తదితరులు ఉన్నారు.

సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

అచ్చంపేటటౌన్, ఫిబ్రవరి 25: విద్యార్థులు ప్రణాళికతో సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని భారత్ విద్యా ఉద్యమం వ్యవస్థాపకుడు, ఉపాధ్యాయుడు వెంకటేష్ అన్నారు. భారత్ విద్యా ఉద్యమంలో భాగంగా ఆదివారం పట్టణంలోని ఎస్సీ హాస్టల్‌లో వార్డెన్ మల్లేష్ అధ్యక్షతన ప్రేరణ తరగతులను నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు అందరూ లక్ష్యాన్ని ఏర్పరచుకొని సాధించడానికి ప్రణాళికతో సమయాన్ని సద్వినియోగం చేసుకొని నిరంతరం కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు గత పరీక్ష ప్రశ్న పత్రాలను పరిశీలించి ఏ విషయంలో ఏ టాపిక్స్‌లో ఏ స్థాయిలో ప్రశ్నలు అడుగుతున్నారో తెలుసుకొని ఆవిధంగా సిద్ధం కావాలని సూచించారు. ప్రొఫెసర్ మధు, విద్యుత్ ఏఈ అంజనేయులు, జూనియర్ అసిస్టెంట్ నాసర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రజా సంఘాలు కీలకం

నాగర్‌కర్నూల్ టౌన్, ఫిబ్రవరి 25: ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజా సంఘాల పోరాటం, పాత్ర కీలకమని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.బాల్‌నర్సింహ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ అనుబంధ ప్రజా సంఘాల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు హెచ్.ఆనంద్‌జీ, జిల్లా నాయకులు నరసింహ, విజేయుడు, ఏ సయ్య, కృష్ణాజీ, బాలమురళి, వెంకటమ్మ, ఇంద్రమ్మ, లక్ష్మీపతి, మధుగౌడ్, ప్రేమ్‌కుమార్, శ్రీనివాసులు, బాలపీరు, శివ, కృష్ణ, పర్వతాలు, వెంకటస్వామిపాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా అవకాశం ఇవ్వండి

- కేటీఆర్‌కు మాజీ జడ్పీ చైర్ పర్సన్ పద్మావతి వినతి



బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు వినతిపత్రం ఇస్తున్న మాజీ జడ్పీ చైర్ పర్సన్ పెద్దపల్లి పద్మావతి

నాగర్‌కర్నూల్ టౌన్, ఫిబ్రవరి 25: నాగర్‌కర్నూల్ పార్లమెంటు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా అవకాశం కల్పించాలని జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ పెద్దపల్లి పద్మావతి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ సన్నాహక సమావేశంలో కేటీఆర్‌కు పద్మావతి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ స్థాపించిన నాటి నుంచి పార్టీ అభివృద్ధి కోసం పని చేస్తున్న తన భర్త ఒక పర్యాయం ఎంపీటీసీగా పని చేయడంతో పాటు తాను మూడేళ్ల పాటు జడ్పీ చైర్ పర్సన్‌గా పని చేశానని పేర్కొన్నారు. తదనంతరం బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి అహర్నిషలు పాటు పడుతున్న మాదిగ సామాజిక వర్గానికి చెందిన తనకు పార్లమెంటు అభ్యర్థిగా అవకాశం కల్పించాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు పెద్దపల్లి బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌ను సన్మానించిన మునిసిపల్ చైర్మన్ సత్యం

కల్వకుర్తి: పట్టణంలోని కొట్ర గేట్ వద్ద బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కల్వకుర్తి మునిసిపల్ ఛైర్మన్ ఎడ్మ సత్యం ఘనస్వాగతం పలికారు. ఆదివారం అచ్చంపేట, నాగర్‌కర్నూల్‌లో జరిగే సభలకు బీఆర్ఎస్ సన్నాహక సభలకు పాల్గొనేందుకు వెళుతున్న కేటీఆర్‌ను పులమాలతో, శాలువాలతో సత్కరించారు.

ప్రమాద సూచికలేవీ?

- అసంపూర్తిగా రోడ్డు డివైడర్ పనులు
- రోడ్లు తవ్వేశారు.. వదిలేశారు
- గుంతలమయంతో వాహనదారుల ఇక్కట్లు
- పనులు పూర్తి చేయాలని డిమాండ్
- రూ. 6 కోట్ల వ్యయంతో గత ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభం
- ప్రభుత్వం మారడంతో రోడ్డు విస్తరణ పనులకు గ్రహణం

బిజినేపల్లి, ఫిబ్రవరి 25 : బిజినేపల్లి మండల కేంద్రంలో నాలుగు వైపుల ప్రధాన రహదారి విస్తరణ పనులు చేపట్టి డివైడర్ వేసి రాత్రి వేళల్లో వాహనాలు డివైడర్‌ను ఢీకొట్టకుండా రేడియం స్టిక్కర్లు, ప్రమాద హెచ్చరిక సూచిక బోర్డులను ఏర్పాటు చేయడం మరవడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అలాగే రోడ్డు విస్తరణ పనులు చేపట్టి ఇరువైపులా తొవ్వేసి కంకరతో నింపి వదిలేశారు. దీంతో చాలా మంది వాహనదారులు కంకరలో వాహనాలు అదుపు తప్పి కిందపడి తీవ్ర గాయాల పాలవుతున్నారు. మహబూబ్ నగర్ నుంచి శ్రీశైలం వెళ్లే ప్రధాన రహదారి కావడంతో పాటు వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రాల నుంచి వందల సంఖ్యలో ఆర్టీసీ బస్సులు, వేలాదిగా ప్రై వేటు వాహనాలు హైదరాబాద్‌కు వెళ్లేందుకు ప్రధాన రహదారులు కలిసే కూడలి కావడంతో నిత్యం వాహనాల తాకిడి అధికంగా ఉంటుంది. ఆరు నెలల క్రితం పనులు ప్రారంభించి ఎన్నికల కోడ్ వచ్చే వరకు పనులు శరవేగంగా జరిగినా... ఎన్నికల ఫలితాలు బీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనులు నిలిచిపోయాయని ప్రజలు చర్చించుకుంటున్నారు. అంబేడ్కర్ చౌరస్తాకు నలువైపులా కిలో మీటర్ మేర రోడ్డు విస్తరణ పనులు, సెంట్రల్ లైటింగ్, కూడలి విస్తరణతో పాటు ఇతర అభివృద్ధి పనులకు ఎస్‌డీఎఫ్ (స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్) నిధులు రూ.6 కోట్లు మంజూరయ్యాయి. యుద్ధ ప్రాతిపదికన పనులను ప్రారంభించి డివైడర్ పనులు అరకొర పూర్తి చేశారు. చేసిన పనులకు బిల్లులు ప్రభుత్వం విడుదల చేయకపోవడంతోనే కాంట్రాక్టర్ పనులను నిలిపివేసినట్లు తెలుస్తోంది.

- చీకట్లో డివైడర్‌ను ఢీకొడుతున్న వాహనాలు

నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రం నుంచి మహబూబ్ నగర్ వెళ్ళే ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో భాగంగా ఇరువైపుల రోడ్డును తోవ్వేసి కంకర వేశారు. రోడ్డు మధ్యలో డివైడర్ నిర్మాణం చేశారు. అయితే డివైడర్ ప్రారంభమయ్యే దగ్గర ఎలాంటి రేడియం స్టిక్కర్లు గాని, ప్రమాద హెచ్చరిక సూచిక బోర్డులకు కాని పెట్టకపోవడంతో చీకట్లో వచ్చే వాహనదారులకు డివైడర్ కనిపించకపోవడంతో నేరుగా ఢీకొట్టి గాయాల పాలైన ఘటనలు జరిగాయి, బస్టాండ్ సమీపంలో, కృష్ణవేణి పబ్లిక్ స్కూల్ దగ్గర ఉన్న డివైడర్లను ఆర్టీసీ బస్సులు ఢీకొట్టుకొని ప్రయాణికులు గాయాల పాలయ్యారు. ఎస్బీఐ సమీపంలో కూడా బొలెరో వాహనం డివైడర్‌కు ఎలాంటి సూచిక బోర్డులు లేకపోవడంతో ఢీకొని డ్రైవర్ గాయాల పాలవ్వడంతో పాటు వాహనం పూర్తిగా ధ్వంసమైందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్న సంబంధిత ఆర్ అండ్ బీ శాఖ అధికారులు కానీ, సంబంధిత కాంట్రాక్టర్ కానీ స్పందించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం శోచనీయమని గ్రామస్థులు ఎద్దేవా చేస్తున్నారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం వెంటనే పెండింగ్ పనులు పూర్తి చేసి ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ప్రమాదాలు జరకుండా చూడాలని పలువురు కోరుచున్నారు.



బిజినేపల్లిలో రోడ్డు విస్తరణ పనుల్లో ప్రమాద సూచిక హెచ్చరిక లేని డివైడర్‌లు



ప్రభుత్వ గురుకుల పాఠశాల సమీపంలో డివైడర్ ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు (ఫైల్)

- విస్తరణ పనులు సత్వరమే పూర్తి చేయాలి



బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో సీఎం ప్రత్యేక అభివృద్ధి నిధుల ద్వారా రూ.6 కోట్లు మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి మంజూరు చేయించి పనులు ప్రారంభించారు. ప్రభుత్వం మారిన తర్వాత పనులు పూర్తి చేయకుండా పెండింగ్‌లో పెట్టారు. ప్రస్తుత నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్ రెడ్డి బిజినేపల్లి మండల కేంద్రం రోడ్డు విస్తరణ పనులపై ప్రత్యేక దృష్టి సారించి సత్వరమే పనులు పూర్తి చేయించి ప్రజలను ప్రమాదాలకు గురి కాకుండా కాపాడాలి. రోడ్డు పనులు అసంపూర్తిగా ఉండడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవ్వుతున్నారు.

- పుప్పాల శ్రీనివాస్ గౌడ్, ఎంపీపీ, బిజినేపల్లి

ఓవర్ కాన్ఫిడెన్స్‌తో ఓడిపోయాను

- చేసిన తప్పు సరిదిద్దుకోవడానికి అవకాశం
- పార్లమెంటు ఎన్నికల్లో పార్టీని గెలిపిద్దాం
- మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి
- జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ పార్లమెంటరీ ఎన్నికల సన్నాహక సమావేశం
- హాజరైన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ టౌన్, ఫిబ్రవరి 25: అసెంబ్లీ ఎన్నికల్లో ఓవర్ కాన్ఫిడెన్స్‌తో ఓడిపోయానని నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ పార్లమెంటరీ సన్నాహక సమావేశం నిర్వహించారు. నాగర్‌కర్నూల్ అసెంబ్లీ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరైన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు, రాష్ట్ర కార్యదర్శి బైకని శ్రీనివాస్‌యాదవ్ పాల్గొని ప్రశంసించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ అమలు హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వ హామీలను చూసి అసెంబ్లీ ఎన్నికల్లో గులాబీ జెండాను పక్కన పెట్టి తప్పు చేశామని, రెండు నెలల్లోనే ప్రజలు ఆలోచిస్తున్నారన్నారు. తమకు ఓడిపోయామన్న బాధేమి లేదని, పదేళ్ల పాలనలో చేసిన తప్పులను సరిదిద్దుకోవడానికి ప్రజలు అవకాశం ఇచ్చారని పేర్కొన్నారు. అధిష్ఠానం ఎవరికి టికెట్ ఇచ్చినా రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇద్దామని మర్రి పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు మాట్లాడుతూ పచ్చబడుతున్న రాష్ట్రాన్ని అబాసుపాలు చేస్తున్న కాంగ్రెస్ పాలనను చూస్తున్న ప్రజలు తెలంగాణకు కేసీఆరే శ్రీరామ రక్షని నమ్ముతున్నారన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంటు పరిధిలో అనుభవం ఉన్న పార్టీ నాయకత్వం ఉందని, పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు పట్టం కట్టాలని ప్రజలను కోరారు. బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బైకని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ పార్లమెంటు పరిధిలోని 2 వేల పోలింగ్ బూత్‌ల్లో అసెంబ్లీ ఎన్నికల కంటే 50 ఓట్లు ఎక్కువగా తెచ్చి పార్టీని గెలిపించుకుందామన్నారు. మాజీ ఎమ్మెల్యే బాజీరెడ్డి గోవర్దన్‌రెడ్డి, జడ్పీ చైర్ పర్సన్ బి.శాంతకుమారి, మునిసిపల్ చైర్ పర్సన్ కల్పన, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ ఇంతియాజ్ ఇసాక్, జిల్లా గ్రంథాలయాల సంస్థ ఛైర్మన్ హనుమంతరావు, మునిసిపల్ వైస్ ఛైర్మన్ బాబురావు, బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం

- 25 ఏళ్లకు ఏకమైన బాల్య మిత్రులు



పాలెంలో ఉపాధ్యాయులను సత్కరించిన టీఎస్ఎంహెచ్ఎస్ 1997-98 పదవ తరగతి పూర్వ విద్యార్థులు

బిజినేపల్లి, ఫిబ్రవరి 25 : ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి చదువులమ్మ ఒడిలో ఒక్కటై చదువుకున్న బడిలో 25 ఏళ్లకు పూర్వ విద్యార్థులంతా ఒక్కటైన అపూర్వ సమ్మేళనం అద్యంతం ఆనందబాష్పాలతో కొనసాగింది. మండలంలోని పాలెంలోని తోటపల్లి సుబ్రమణ్యం(సుబ్బయ్య) మెమోరియల్ హైస్కూల్‌లో 1997-98 సంవత్సరం పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించి తమకు బోధించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి మాట్లాడారు. పదవ తరగతి పూర్తైన తర్వాత కొందరు ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు చేస్తుండగా మరికొందరు అంతటితోనే చదివి ఆపేసి వ్యవసాయం, వ్యాపారాలతో పాటు వివిధ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని వారి వారి అనుభవాలను ఒక్కరి ఒక్కరు పంచుకున్నారు. పాఠశాలలో చదువుకున్న రోజుల్లో చేసిన చిలిపి చేష్టలను, ఉపాధ్యాయులతో, తోటి విద్యార్థులతో తమ అనుబంధాలను, మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకొని సంబురపడ్డారు. అనంతరం తిరిగి వెళ్లేటప్పుడు ఒకరినొకరు ఆలింగనం చేసుకొని బాధాతప్త హృదయాలతో వీడ్కోలు పలికారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు హనుమంతరావు, జగన్నాథ్ రెడ్డి, కుసుమలత, రామయ్య, ఉపాధ్యాయుడు గోపాల స్వామి, పూర్వ విద్యార్థులు గంగు ప్రవీణ్, ధర్మరావు, బాల చెన్నయ్య, మల్లేష్ గౌడ్, రామచంద్రయ్య విజయభాస్కర్, రాజు గౌడ్, రామస్వామి, శ్రీనివాసులు, చందు, నాగరాజు, జాకీర్, శేఖర్, నిజాముద్దీన్, కురుమయ్య, షాహిని, కవిత, మయూరి, చంద్రకళ తదితరులు ఉన్నారు.



కోడేరులో ఉపాధ్యాయులతో 2007 పదవ తరగతి పూర్వ విద్యార్థులు

● కోడేరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2007లో పదవ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. అనాడు విద్యా బోధన చేసిన ఉపాధ్యాయులను సమ్మేళనానికి ఆహ్వానించి శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా పలువురు పూర్వ విద్యార్థులు చాలా కాలం తరువాత చదువుకున్న పాఠశాలలో కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఉపాధ్యాయులు తిరుపతి రెడ్డి, బాలస్వామి, మురళిమోహన్, శ్రీకాంత్, వెంకటేష్, రాములు, శేషయ్య, పూర్వ విద్యార్థులు ఖాదర్‌పాష, ఖలీల్, ప్రదీప్, జగన్, ఖాజా, ఖాసీమ్, శివమ్మ, సింధూజ తదితరులు ఉన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి రథోత్సవం

- పాల్గొన్న ప్రముఖులు

పెద్దకొత్తపల్లి, ఫిబ్రవరి 25: మండల పరిధిలోని దేవుని తిర్మలాపూర్‌లో శ్రీవేంకటేశ్వరస్వామి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ నెల 18 నుంచి 26 వరకు నిర్వహిస్తున్న వేంకటేశ్వరస్వామి వారి బ్రహోత్సవాల్లో భాగంగా శనివారం అర్ధరాత్రి శ్రీదేవి, భూదేవి సమేతంగా స్వామివారి రథోత్సవాన్ని కనుల పండువగా జరిపారు. భక్తుల కోలాహలం మధ్య ఆలయ ప్రాంగణం నుంచి దిగువ తిరుపతి వరకు గోవింద నామస్మరణతో రథాన్ని లాగుతూ ఊరేగించారు. రథోత్సవాన్ని తిలకించేందుకు పెద్దకొత్తపల్లితో పాటు మండల పరిధిలోని వెన్నచెర్ల, పెద్దకార్పాముల, నక్కలపల్లి, చంద్రకల్, ముష్టిపల్లి, మరికల్, సాతాపూర్, జొన్నలబొగుడ, కోడేరు మండలం తీగలపల్లి, బావాయిపల్లి, జనుంపల్లి తదితర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తిలకించారు. ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ రథోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్‌ఐ సతీష్ ఆధ్వర్యంలో పోలీసులు నిరంతరం పర్యవేక్షించారు. కార్యక్రమంలో తిర్మలాపూర్ మాజీ సర్పంచులు వి.సత్యం, పి.చిన్నయ్య, ఎంపీటీసీ సభ్యులు ప్రతాప్‌రెడ్డి, డి.రవికుమార్, మాజీ ఉపసర్పంచు వి.శ్రీనివాసులు, సీపీఐ మండల కార్యదర్శి శ్రీనివాసులు, కాంగ్రెస్ నాయకులు పుట్ట ఆంజనేయులు, జి.బాలస్వామి, మేకల చంద్రయ్య, కె.దేవేందర్, బీఆర్ఎస్ నాయకులు ఏదుల కురుమయ్య, పి.విజ్జయ్య, పి.యాదగిరి, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



దేవుని తిర్మలాపూర్‌లో రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



రఘుపతిపేట, రామగిరిలోని ఆలయంలో రథాన్ని లాగుతున్న భక్తులు

● కల్వకుర్తి: మండల పరిధిలోని రఘుపతిపేట, రామగిరిలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో దేవాలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. ఆదివారం తెల్లవారుజామున రథోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రథాన్ని పచ్చటి తోరణాలు, పుష్పాలతో అలంకరించి ఉత్సవ విగ్రహాలను రథంపై ఉంచి భక్తులు రథాన్ని లాగి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు.

బీజేపీతో జిల్లాకు ఒరిగిందేమి లేదు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయకుమార్‌రెడ్డి

కల్వకుర్తి, ఫిబ్రవరి 25: భారతీయ జనతా పార్టీ వల్ల ఉమ్మడి పాలమూరుకు ఒక్క కొత్త ప్రాజెక్ట్ రాలేదని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితీ విజయకుమార్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం ఆయన ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. నిరుద్యోగులను సైతం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విస్మరించిందని ఆయన ఆరోపించారు. బీజేపీ కేవలం మత విద్వేషాలు రెచ్చగొట్టి పదవులను పొందాలని చూస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతుందన్నారు. దేశంలో రాహులు గాంధీ ప్రధాన మంత్రి కావడం ఖాయమని విజయకుమార్‌రెడ్డి దీమా వ్యక్తం చేశారు. విలేకర్ల సమావేశంలో పట్టణ అధ్యక్షుడు చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు మిరియాల శ్రీనివాస్‌రెడ్డి, సుస్తకాల రహులు, శ్రీధర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, బీస బాలరాజు, జంగయ్యగౌడ్, బండి సుదర్శన్, భరత్, మాలిక్ పాల్గొన్నారు.

సీఐ, ఎస్సైలకు సన్మానం



సీఐ నాగర్జున, ఎస్సై మాధవరెడ్డిలను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

కల్వకుర్తి, ఫిబ్రవరి 25: కల్వకుర్తి సీఐ నాగర్జునను, ఎస్సై మాధవరెడ్డిలను ఆదివారం లయన్స్ క్లబ్ కల్వకుర్తి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పట్టణంలోని పోలీసుస్టేషన్‌కు నూతనంగా వచ్చిన సీఐ, ఎస్సైలను పూలమాలలతో, శాలువాలతో సత్కరించారు. సన్మానించిన వారిలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కల్మిచర్ల రమేష్, ప్రధాన కార్యదర్శి చిగుళ్లపల్లి శ్రీధర్, కోశాధికారి గోవిందు శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శి మిరియాల శ్రీనివాస్‌రెడ్డి, మెంబర్ షిప్ కమిటీ ఛైర్మన్ గుబ్బా కిషన్, తర్నికల్ శ్రీనివాస్, ప్రచార కార్యదర్శి అప్పాయపల్లి శ్రీనివాస్, దుగ్గి వెంకటేష్, జూలూరి సత్యం, సురేందర్‌రెడ్డి, పూరి రమేష్, రవిగౌడ్, గణేష్‌లు పాల్గొన్నారు.

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల కమిటీ ఎన్నిక

నాగర్‌కర్నూల్ టౌన్, ఫిబ్రవరి 25: ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా నూతన కార్యవర్గం ఏర్పడింది. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా నూతన అధ్యక్షుడిగా బి.చిట్టిబాబు, ఉపాధ్యక్షులుగా పీఎల్.నారాయణ, డీపీ.స్వామి, కోశాధికారిగా జంగయ్య, సలహాదారుగా శ్రీనివాసులు, కార్యదర్శిగా ప్రభాకర్, సహాయ కార్యదర్శిగా ఎల్‌గోవర్దన్, కార్యవర్గ సభ్యులుగా నిరంజన్, టీఎస్.నారాయణ లను ఎన్నుకున్నారు.

టీఎన్‌జీవో నియోజకవర్గ కమిటీ ఎన్నిక

నాగర్‌కర్నూల్ టౌన్, ఫిబ్రవరి 25: టీఎన్‌జీవో నాగర్‌కర్నూల్ అసెంబ్లీ నియోజకవర్గం నూతన కార్యవర్గం ఏర్పడింది. ఆదివారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవోస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు భవాండ్ల వెంకటేష్ ఆధ్వర్యంలో అసెంబ్లీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నియోజకవర్గ అధ్యక్షుడిగా సయ్యద్ నసీర్, కార్యదర్శిగా ఎం.సురేష్‌కుమార్, కోశాధికారిగా యాదగిరి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా శివానందరెడ్డి, మురళి, లక్ష్మీకుమారి, సంయుక్త కార్యదర్శులుగా చంద్రశేఖర్, మాసూమ్, రాధ, స్టైలాబ్, సురేష్‌కుమార్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, హేమలత, భార్గవ్‌సాగర్, రజితమ్మలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టీఎన్‌జీవోస్ జిల్లా కార్యదర్శి ఆర్.లక్ష్మణ్, కోశాధికారి షర్ఫుద్దీన్, నాయకులు సత్యనారాయణయాదవ్, వేణుగోపాల్‌రెడ్డి, జె.రఘువేందర్, జీకే.వెంకటేష్, రాంరెడ్డి, షేక్ కరీముల్లా, ఈశ్వరన్న, బాలరాజు, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు భూమిపూజ

కోడేరు, ఫిబ్రవరి 25 : మండల పరిధిలోని నర్సాయిపల్లి గ్రామంలో ఆదివారం ఆగ్రామ ఎంపీటీసీ రాచూరి శ్యామల సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ నిధుల నుంచి మంజూరైన రూ.20 లక్షల ఖర్చుతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టడం జరిగిందని శ్యామల తెలిపారు. గ్రామంలో ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో రోడ్డు, అభివృద్ధి పనులు చేపట్టి అభివృద్ధి చేసుకుంటామని అన్నారు. మాజీ పీఏసీఎస్ చైర్మన్ నాగారం కొండల్‌రావు, సింగిల్ విండో డైరెక్టర్ కొమ్ముల అంజనేయులు, నరహరిగౌడ్, మెకానిక్ బాలస్వామి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తాళ్ళ వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.

చిన్నారెడ్డికి సన్మానం



చిన్నారెడ్డిని సన్మానించిన మాజీ సర్పంచ్ రాజేష్‌రెడ్డి

కల్వకుర్తి, ఫిబ్రవరి 25: రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా ఏఐసీసీ కార్యదర్శి, మాజీ మంత్రి డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డిని నియమించడంతో ఆదివారం ఆయన గృహంలో కల్వకుర్తి మండలంలోని తోటపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పసుల రాజేష్‌రెడ్డి కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్థిక సహాయం అందజేత

చారకొండ, ఫిబ్రవరి 25: మండల కేంద్రానికి చెందిన జూలురి లాలయ్యగౌడ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకొన్న కల్వకుర్తి నియోజకవర్గ గౌడ సంఘం నాయకులు ఆదివారం లాలయ్యగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. కల్వకుర్తి నియోజకవర్గ గౌడ్ సంఘం అధ్యక్షుడు అల్లాజిగౌడ్, కోశాధికారి తాళ్ల వెంకటయ్యగౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జమ్మికింది బాల్‌రాంగౌడ్, రైతుబంధు మండల అధ్యక్షుడు గజ్జె యాదయ్యగౌడ్, గౌడ సంఘం నాయకులు సింగం బాలస్వామిగౌడ్, సదానందంగౌడ్, జేసీబీ వెంకటయ్యగౌడ్, గజ్జె కొండలయ్యగౌడ్, గజ్జె శ్రీరాములుగౌడ్, నారాయణగౌడ్, మట్ట వెంకటయ్యగౌడ్, లింగంగౌడ్, సవారి జంగయ్యగౌడ్, జానపాండుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'సంకల్పయాత్ర బీజేపీ విజయానికి దోహదం'

వంగూరు, ఫిబ్రవరి 25: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు విజయ సంకల్పయాత్ర దోహదపడుతుందని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు అల్లె భీమయ్య అన్నారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ తీసుకుంటున్న చారిత్రాత్మక నిర్ణయాలు దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నాయన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను ప్రజలు భారీ మెజారిటీతో గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.